విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా

ఫేషియల్ అటెండెన్స్ సమస్యలను పరిష్కరించాలి:ఎస్‌టియు

విశాలాంధ్ర బ్యూరో - నెల్లూరు: మొదటగా ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని ప్రస్తుతం అన్ని విభాగాలలోని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అందరూ ఫేషియల్ అటెండెన్స్ ద్వారా మాత్రమే హాజరు నమోదు చేయాలని ప్రకటించిన నేపథ్యంలో ఫేషియల్ అటెండెన్స్ వేయడంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించిన తర్వాత అమలు చేయాలని ఎస్టీయూ నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పన ఏడుకొండలు డిమాండ్ చేశారు. నేడు నెల్లూరు జిల్లా కొండాపురం మండలంలో రాష్ట్ర కార్యదర్శి అశోక్ బాబు, ఎలక్షన్ కమిటీ ట్రిబ్యునల్ మెంబర్ ఆదినారాయణ,రాష్ట్ర కౌన్సిలర్ మహేష్ తదితరులతో కలసి ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పన ఏడుకొండలు ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా మన రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఫోన్లలో ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని ప్రవేశపెట్టారని, పరిమిత సంఖ్యలో ఉండే ఉపాధ్యాయులకు ఈ విధానం ప్రవేశపెట్టినప్పుడే అనేక సమస్యలు ఎదుర య్యాయని, ఇప్పుడు పెద్ద మొత్తంలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తే అనేక సమస్యలు ఎదురయ్యి సమయానికి హాజరు నమోదు కావడం లేదని ఆయన ఆవేదన చేశారు. కావున ఇంత పెద్ద మొత్తంలో ఒక ప్రత్యేక హాజరు విధానాన్ని ప్రవేశపెట్టేటప్పుడు సమస్యలు రాకుండా తగిన పరికరాలు, తగిన నెట్వర్క్ ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ అనేకమంది ఉపాధ్యాయులు సమయానికి నెట్వర్క్ సమస్య వల్ల హాజరు నమోదు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అని అన్నారు.కావున ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించి, మంచి వేగంతో పని చేసే నెట్వర్క్ కల్పించి, తగిన పరికరాలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కొండాపురం ఎస్టియు బాధ్యులు హరికృష్ణ, శ్రీహరి,రఘు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీచట్టం పకడ్బందీగా అమలు చేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నెల్లూరు: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలు చేయడంతో పాటు, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులకు సంబంధించి నమోదైన కేసులను సత్వరమే పరిష్కరించి బాధిత కుటుంబాలకు న్యాయం అందించగలిగే విధంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్ బాబు పేర్కొన్నారు.శనివారం ఉదయం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టరు చక్రధర్ బాబు అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ (ఎస్.సి., ఎస్.టి. అత్యాచార నిరోధక చట్టం) సమావేశం జరిగింది. ఈ సంధర్బంగా జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు, ఎస్.పి సి.హెచ్. విజయ రావు, శాసనమండలి సభ్యులు బల్లి కళ్యాణ చక్రవర్తి తో కలసి జిల్లాలో ఎస్.సి., ఎస్.టి. అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసులను డివిజన్ల వారీగా వారీగా సమీక్షించి కేసుల పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి సారించి, బాధిత కుటుంబాలకు న్యాయం అందించగలిగే విధంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, సోషల్ వెల్ఫేర్ డిడి వెంకటయ్య, నెల్లూరు, కావలి, ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు మాలోల,శీనా నాయక్, కరుణకుమారి, కమిటీ సభ్యులు కె. రఘు, శేషం సుదర్శనం, పి. సుబ్బరాయుడు, కె.సి.పెంచలయ్య, డి ప్రసన్న గణపతి, ఖాజారసూల్, ఏం. సురేంద్ర రెడ్డి, సాయి ప్రసాద్, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల
ఓటర్ల జాబితాలో తప్పులు వుంటే చెప్పాలి: డిఆర్‌వో

విశాలాంధ్ర బ్యూరో - నెల్లూరు: జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి నియోజకవర్గాల ఓటర్ల జాబితా పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని జిల్లా రెవెన్యూ అధికారి సి. వెంకటనారాయణమ్మ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధు లను కోరారు. శనివారం నగరంలోని కలెక్టరేట్ ఎస్ ఆర్ శంకరన్ హాల్లో ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి నియోజకవర్గాల ఓటర్ల జాబితా తయారీ పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా స్థాయి సమావేశాన్ని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి కెవిఎన్ చక్రధర్ బాబు ఆదేశాల మేరకు డిఆర్ఓ నిర్వహించారు.ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం షెడ్యూలు ప్రకారం జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి నియోజకవర్గాల జాబితాను గత ఏడాది డిసెంబర్ 30వ తేదీన ప్రచురించడం జరిగిందన్నారు. ఆ జాబితా ప్రకారం జిల్లాలో 1,03,969 మంది పట్టభద్రుల నియోజక వర్గానికి, 7713 మంది ఉపాధ్యాయుల నియోజకవర్గానికి ఓటర్లుగా నమోదయ్యారన్నారు. ఓటర్ల జాబితా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయడం జరిగిందని, అందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫారం-7 లోను, చేర్పులు మార్పులు ఉంటే ఫారం-8లోను దరఖాస్తులు అందజేయాలన్నారు. జిల్లాలో పట్టభద్రుల నియోజకవర్గానికి 76 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల నియోజకవర్గానికి 36 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. అనుబంధ పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సమయంలో ఏర్పాటు చేస్తారన్నారు.ఇంకా అర్హులైన వ్యక్తులు ఓటర్లుగా పేరు నమోదు చేసుకోవాలంటే పట్టభద్రులకైతే ఫారం-18 లోను, ఉపాధ్యాయులు అయితేఫారం-19లోను దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈ సమావేశంలో ఈఆర్వోలు నగర కమిషనర్ డి హరిత, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీవోలు ఏ మలోల,సీనా నాయక్ కరుణ కుమారి, వైఎస్ఆర్సిపి ప్రతినిధి మురళీధర్ రెడ్డి, టిడిపి ప్రతినిధి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి,బిజెపి ప్రతినిధి కాళేశ్వరరావు, సిపిఎం ప్రతినిధి మోహన్ రావు, సిపిఐ ప్రతినిధి సిరాజ్, బీఎస్పీ ప్రతినిధి బి రాజా,ఎన్ సి పి ప్రతినిధి శేఖర్ పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి పారిశుధ్య కార్మికుల ఆందోళన

విశాలాంధ్ర - కావలి : కార్మికుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, వేధింపులకు గురిచేస్తున్న మూడవ డివిజన్ శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్ పై చర్యలు తీసుకోవాలని కావలి మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భగా శనివారం మస్టర్ సమయంలో కార్మికులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆఫీస్ లో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ ను శానిటరీ ఇన్స్పెక్టర్ గా నియమించి, 10 మంది చేయవలసిన పనిని 5 మంది చేత చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా మొత్తం కార్మికులలో సగం మంది పనిచేస్తున్నారని, దీనివలన తీవ్ర పని భారం పెరిగి కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. కార్మికులలో మిగతా సగం మంది ఎక్కడ పనిచేస్తున్నారో తెలియడం లేదని తెలిపారు. పనిచేస్తున్నప్పుడు కార్మికులకు ఎలాంటి సౌకర్యాలు, పనిముట్లు ఇవ్వడం లేదన్నారు. పనిలో ప్రమాదం జరిగి సెలవు కావాలంటే, మూడు రోజుల ముందు అనుమతి తీసుకోవాలని పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. ఈరోజు పనిలో దెబ్బ తగిలితే మూడు రోజుల ముందు అనుమతి ఎలా తీసుకుంటారని అన్నారు. ఏదైనా కార్మికుడు సెలవు పెట్టినా, ఊరు విడిచి వెళ్లరాదని, ఒక వేల వెళితే వారి వ్యక్తిగత విషయాలను తెలియపరచమంటాడని తెలిపారు. కార్మికుల వ్యక్తిగత విషయాల్లో తలదూరుస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, ఆయన చేరిన మూడు నెలలుగా ఇదే తంతు జరుగుతుందని అన్నారు. ఇప్పటివరకు ఆయన పనిచేసి వచ్చిన అన్ని చోట్ల గొడవలు జరిగాయని, వివిధ కేసులు కూడా నమోదు అయ్యాయని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్ ను విధుల నుండి తప్పించాలని లేనిపక్షంలో సమ్మెను ఇలాగే కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లి అంకయ్య, సిపిఐ కావలి నియోజకవర్గ కార్యదర్శి కొప్పోర్తి నాగరాజు, యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఆదినారాయణ, కార్యదర్శి గుంజి కిషోర్, ఏఐటీయూసీ నాయకుడు చేవూరి కొండయ్య, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల టీచర్ల సర్వీస్ రూల్స్ పై పోరాటం

విశాలాంధ్ర -సీతారాంపురం: తాను పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిస్తే రాష్ట్రంలోని 164 మోడల్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యా యుల సర్వీసులపై శాసనమండలిలో పోరాటం చేస్తానని నెల్లూరు ప్రకాశం చిత్తూరు జిల్లాల పట్ట బద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. శనివారం ఆదర్శ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలలు 2013 లో రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి రాష్ట్రంలో పేద పిల్లలకు ఇంగ్లీష్ మీడియం విద్య ఉచితంగా అందించాలని 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ ప్రారంభించినప్పటికీ నేటి వరకు ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ లేవంటే హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. పేరుకు మటుకు జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇంగ్లీష్ మీడియం పాఠశాల లో అందరూ ఇంగ్లీష్ మీడియం చదవాలని గొప్పలు చెబుతున్నారు తప్ప ఇక్కడ ఇంగ్లీష్ మీడియం చెప్తున్న ఉపాధ్యాయుల ను మటుకు మరిచిపోయినట్టున్నారని ఎద్దేవా చేశారు. టీవీ ఛానల్ లో ప్రభుత్వ స్కూల్లో సైతం ఇంగ్లీష్ మీడి యం అనర్గళంగా విద్య అందుతుందని బెండపూడి స్కూల్‌ను చూపిస్తూ అక్కడి కొందరి విద్యార్థుల చేత అమెరికన్ ఇంగ్లీష్ మాట్లాడిస్తూ అటు ప్రజలను ఇటు ఉపాధ్యాయ లోకాన్ని మోసం చేస్తున్నారని తెలిపారు. నిజంగా జగన్ కు చిత్తశుద్ధి ఉంటే ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో పేద పిల్లలకు ఇంగ్లీషు ఓనమాల నేర్పి స్తున్న ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులపై ఇంత చిన్న చూపు చూసేవారు కాదని 10 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ హెల్త్ కార్డులు సర్వీస్ రూల్స్ కారుణ్య నియామకాలు లేక కనీసం ఒకటో తారీఖు జీతాలు పడతాయని నమ్మకం లేక రాష్ట్రంలోని 164 మోడల్ స్కూల్స్ లో పనిచేస్తున్న ఉపాధ్యా యులు ఈ నెల దుర్భర జీవితాన్ని గడుపుతున్నారన్నారు. గడచిన కరోనా సమయంలో వైరస్ వల్ల సైతం ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కొంతమంది చనిపోయినా ఇప్పటి వరకు ఆ కుటుంబాలకి ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదని ఆ కుటుంబాలు రోడ్డున పడి విలపిస్తున్నాయని తెలిపారు. నిజంగా ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల దయనీయ జీవితాన్ని చూస్తే తనకు చాలా బాధే సిందని వీరు పేరుకే ఉపాధ్యాయులు అని చెప్పుకుంటున్నారు తప్ప వీరికి ఎటువంటి హక్కులు లేవని మూడు జిల్లాల్లో ఆదర్శ పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు తన కు వేసి గెలిపించాలని గెలిచిన వెంటనే శాసన మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల సహకారంతో ఆదర్శ పాఠశా లలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా సర్వీసులు తీసుకొచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. ఆదర్శ పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ జమున, మండల జిల్లా ఏపీ ఎం ఎస్ టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడమ్ తిరుపతయ్య, మండల యూటీఎఫ్ అధ్యక్షులు భోగ్యం శ్రీనివా సు లు, రంజు జానీ వెంకటేశ్వర్లు, రాజేష్ వివి నారాయణ, విజయ్ యాదవ్, మస్తాన్ ,ఫాతిమా, కళ్యాణి, వాసంతి, మస్తాన్, టి నారాయణ, శ్రీహరి, ఎస్ కే బి సందాని, ఎర్రబాబు, పాల్గొన్నారు.

దళితుల పై దాడులకు ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి కారణం

- అఖిలపక్ష నేతలు ఘాటు విమర్శలు

విశాలాంధ్ర - కావలి : నియోజకవర్గంలో దళితులపై దాడులు ఎక్కువై పోయాయని, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అండతోనే వారి అనుచరులు ఈ దాడులకు తెగబడుతున్నారని అఖిల పక్ష నేతలు కొప్పర్తి నాగరాజు (సిపిఐ), చింతాల వెంకట్రావు (కాంగ్రెస్) పసుపులేటి పెంచలయ్య (సిపిఎం) కరవది భాస్కర్ (సిపిఐ యంఎల్), రుషికేష్ (జనసేన) వై.లక్ష్మిరెడ్డి (సిపిఐ యంఎల్) ఆరోపించారు. శనివారం పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్ నందు వారు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ 1947 కు ముందు నిజాం ప్రభుత్వంలో ప్రజలు నీ కళ్లు మెక్కుతా బాంచన్ దొరా అంటూదొరలను ఏ విదంగా మొక్కారో, అదే ధోరణిని నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి కొనసాగిస్తూ, కాళ్లు మొక్కించుకుంటూ నిజాం దొరలా వ్యవహరిస్తున్నారని అన్నారు. కావలి నియోజకవర్గంలో దళితులపై దాడుల పరంపర కొనసాగుతుందన్నారు. ముసునూరుకు చెందిన దూగ్గిరాల కరుణాకర్, కడనూతలకు చెందిన హర్ష పై ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి వేదింపులకు గురిచేస్తే వారు ఎమ్మెల్యే కాళ్లు పట్టుకున్నా కనికరించకపోతే కరుణాకర్ చనిపోతే, హర్ష చావు బ్రతుకల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. అవి మరవకముందే ఉలవపాళ్ల కు చెందిన తేజపై అగ్రవర్ణాలకు చెందిన మహేష్ నాయుడు కుల దుహంకారంతో కాళ్లతో కర్రలతో, రాడ్డులతో దాడి చేసినట్లు వీడియోలు ఉన్నా స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించేటట్లు ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి సహకరించారన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కృష్ణమోహన్, జనసేన జిల్లా కార్యదర్శి వెంకట సబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇదేం ఖర్మ -మన రాష్ట్రా నికిని విజయవంతం చేయండి

విశాలాంధ్ర- రాపూరు: మండల కేంద్రమైన రాపూరు లో టీడీపీ నిర్వహిస్తున్న ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్య క్రమాన్ని సోమవారం ఉదయం 9.00 గంటలకు కార్యక్రమం జ రుగుతుం దని, ఈకార్యక్రమంలో వెంకటగిరి నియోజక వర్గ మాజీ శాసనసభ్యులు, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కురుగొండ్ల రామకృష్ణ పాల్గొంటారని రాపూరు మండల అధ్యక్షు లు దందొలు వేంకటేశ్వర రెడ్డి అన్నారు.

పట్టభద్రుల ఓటర్ల జాబితాలో అవకతవకలను, తప్పులను సరిదిద్దాలి: టీడీపీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు లోని కలెక్టరేట్ లోని శంకరన్ హాలులో డిఅర్ఓ ఆధ్వ ర్యంలో పట్టభద్రుల ఉపాధ్యా య ఓటర్ల జాబితాపై జరిగిన రాజకీయ పార్టీల సమావేశంలో టీడీపీ నెల్లూరు పార్లమెంట్ ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్ల జాబితా తయారీ లో అనేక అక్రమాలు జరిగాయని,వాటి పై విచారణ జరిపి బోగస్ ఓట్లను తొలగించాలని,పట్టభద్రుల ఓటర్ల జాబితా తయారీలో అనేక తప్పులు ఉన్నాయని.కొందరి ఓట్లు వారి నివాసం కు దూరంగా ఉన్న పోలింగ్ బూత్‌లలో ఉన్నాయని, జాబితాలో ఉన్న తప్పులను సరి దిద్దాలని సమావేశంలో కోరడం తో పాటు దీనిపై డి అర్ ఓకి వినతి పత్రం సమ ర్పించా మన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికా రులు, టీడీపీ తరుపున చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, కంచర్ల శ్రీకాంత్,ఎస్ కే రసూల్, దర్శి హరికృష్ణ తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా కమ్యూనిస్టు నేత ఈశ్వరయ్య జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు నగరంలోని పోలీస్ బాయ్స్ హాస్టల్ లో కార్యకర్తల కర్మాగారం తెలుగు రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో కార్యకర్త లను తయారుచేసిన ఎంతోమంది యువకులను కమ్యూ నిస్టులు గా తయారుచేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఈశ్వరయ్య జన్మదిన వేడుకలు నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.లీలా మోహన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈశ్వరయ్య గత 40 సంవత్స రాలుగా విద్యార్థి యువజన కమ్యూనిస్టు పోరాటాలలో ప్రముఖంగా ఉంటూ ప్రజల వైపున పోరాటాలు చేస్తూ అనేక ఉద్యమాల నిర్వ హిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా ఉన్న నాయకుని జన్మదిన వేడుకలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో ఆయనను ఆదర్శంగా తీసుకుని మరిన్ని పోరాటాలు నిర్వహించే విధంగా మరింత ఉత్సాహంతో పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ బాయ్స్ హాస్టల్ విద్యార్థులు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ నాయకుల సురేష్ హరీష్ చరణ్ గౌడ్ ముక్తియార్ పాల్గొన్నారు.

దళితులపై దాడులకు ఎస్పి నైతిక బాధ్యత వహించాలి: టీడీపీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: కావలి ఎమ్మెల్యే పై అట్రాసిటీ కేసులను నమోదు చేయాలని టీడీపీ నాయకులు కోరారు. నెల్లూరు పార్లమెంట్ టిడిపి ఎస్సీ నాయకులు శనివారం నగరంలోని ఎన్టీఆర్ భవన్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శులు జెన్నీ రమణయ్య, దావా పెంచల్ రావు మాట్లాడుతూ .రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు జరుగు తున్నాయని ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో అత్యధిక శాతంలో జరుగు తున్నాయన్నారు. నెల్లూరు జిల్లాలో ప్రత్యక్షంగా పరోక్షంగా పదిమంది దళితుల కు అన్యాయం జరిగిందని నలుగురు హత్యకు గురయ్యారని, నలుగురు ఆత్మహత్య చేసుకున్నారని, ఒకరు చావు బతుకుల్లో ఉన్నారని దీనికి జిల్లా ఎస్పీ నైతిక బాధ్యత వహించాలని అన్నారు. కరుణాకర్ ఆత్మహత్య చేసుకోవడానికి పైడి హర్ష ఆత్మహత్యా యత్నం చేయటానికి ప్రత్యక్ష కారణం కావాలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అని పెట్రోల్ బంక్ లో పనిచేసే యువకుడి పై దాడి చేసిన గోచిపాతల మోషే ని కాపాడింది కూడా రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అన్నారు. దళితుల ఆత్మహత్యలకు ప్రోత్సహించింది రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అని ఆయన చట్టానికి అతీతులు కాదని ఆయనపై అట్రాసిటీ 307 కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

సోమిరెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలే: వైసీపీ

విశాలాంధ్ర- ముత్తుకూరు: మత్స్య కారేతర ప్యాకేజీ పై మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలేనని ముత్తుకూరు వైసిపి కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ పోలిరెడ్డి చిన్నపరెడ్డి, మండల బీసీ సెల్ నాయకులు నడవడి ముత్యం గౌడ్ లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కృష్ణపట్నం పోర్టు ప్రభావిత గ్రామాలైన గ్రామాల్లోని మత్స్యకారులు కానటువంటి వారి ఉపాధి కోసం మత్స్య కార్యతర ప్యాకేజీని మంజూరు చేయించామన్నారు. అయితే అప్పటినుండి తదుపరి వచ్చిన ప్రభుత్వాలు దాన్ని పక్కన పెట్టేశాయన్నారు. 2014 ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గం నుండి ఎన్నికైన కాకాని గోవర్ధన్ రెడ్డి శాసనసభలో ప్రతిపక్ష శాసనసభ్యునిగా ఉన్నప్పుడు శాసనసభలు ఈ ప్యాకేజీ పై చర్చిం చారన్నారు. అయితే అప్పటి టీడీపీ ప్రభుత్వం స్పందించకపోవడంతో అలాగే ఉండిపోయిందన్నారు. 2019 ఎన్నికల ముందు జనవరిలో ఈ ప్యాకేజీ పంపిణీకై జీవో తెచ్చిన సోమిరెడ్డి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు పంపిణీ చేయలేదన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పుడు హడావిడిగా కొందరికి మాత్రమే ఇచ్చారని గుర్తు చేశారు. గత ఎన్నికల సమయంలో మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే తప్పనిసరిగా మండలంలోని ప్రతి కుటుంబానికి మత్స్యకార ప్యాకేజీని పంపిణీ చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఒదుకు అనుగుణంగానే ముఖ్య మంత్రితో చర్చించి ప్రస్తుతం నిధులు మంజూరు చేయించి ప్రతి ఒక్కరికి ఈ ప్యాకేజీని పంపిణీ చేస్తున్నామన్నారు. అయితే లబ్ధిదారుల అకౌంట్ నంబర్లు ఫోన్ నెంబర్ కు లింకు కాకపోవడం, ఆధార్ లో తప్పులు ఉండడం కారణంగా రెండు శాతం మందికి ఇంకా పడలేదని అయితే మంజూరైన నిధులు అలాగే ఉన్నాయని అధికారులు వాటిని పరిశీలిస్తున్నారని త్వరలో వారికి కూడా ఈ ప్యాకేజీ నిధులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అయితే ప్యాకేజీ పంపిణీ పై అవగాహన లేని సోమిరెడ్డి మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పై నిందారోపణలు చేయడం తగదన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే నాలుగు పర్యాయాలు సోమిరెడ్డిని ప్రజలు ఓడించిన నేటికీ బుద్ధి రాకపోవడం విచారకరమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు బందెల వెంకట రమణయ్య, ఎంపీటీసీ సభ్యులు నవీన్ భాష, వెంకటేశ్వర్లు, మాజీ జడ్పిటిసి సభ్యులు నెల్లూరు శివప్రసాద్, ముత్తుకూరు వైసిపి నాయకులు కాకుటూరు లక్ష్మణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతంలో రాజశేఖర్ రెడ్డి తెచ్చిన జీవో ని, కాకాని గోవర్ధన్ రెడ్డి తెచ్చిన జీవులను విలేకరులకు చూపించారు.

డయాబెటిక్ ఫుట్ , పాడియాట్రి ఇనిస్టిట్యూట్ ప్రారంభం

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్:భారతదేశంలో ప్రీమియర్ డయాబెటిక్ ఫుట్ కేర్ ఫెసిలిటీ లో ఒకటైన డాక్టర్ ఆర్‌కె డయాబెటిక్ ఫుట్ అండ్ పాడియాట్రీ ఇన్స్టిట్యూట్, రాకేష్ ఝున్‌ఝున్‌వాలా అంప్యుటేషన్ ప్రివెన్షన్ సెంటర్ శనివారం అధికారికంగా చెన్నైలోని కోలాథూర్ వద్ద ప్రారంభిం చారు. ఈ అత్యాధునిక సదుపాయంలో ఉన్న గెయిట్ ఎనాలిసిస్ ల్యాబ్‌ను చారిటబల్ ఎండోమెంట్స్ శాఖామాత్యులు పీ కె శేఖర్ బాబు ప్రారంభించారు. దివంగత రాకేష్ ఝున్‌ఝున్‌వాలా విగ్రహాన్ని రేఖా ఝున్‌ఝున్‌వాలా ఆవిష్కరించడంతో పాటుగా హైపర్ బేరిక్ ఆక్సిజన్ థెరఫీ (హెచ్‌బీఓటీ) మరియు ఆపరేషన్ థియేటర్, ఐసీయు కాంప్లెక్స్‌లను సైతం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్‌కె డయాబెటిక్ ఫుట్ అండ్ పొడియాట్రీ ఇనిస్టి ట్యూట్, రాకేష్ ఝున్‌ఝున్‌వాలా అంప్యుటేషన్ ప్రివెన్షన్ సెంటర్ వ్యవ స్థాపక డైరెక్టర్ డాక్టర్ రాజేష్ కేశవన్ తదితరులు పాల్గొన్నారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రేఖా ఝున్‌ఝున్‌వాలా మాట్లాడుతూ " ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో గొప్ప ఇన్స్టిట్యూట్‌లు మా వారి పాదాలను తొలగిం చాల్సిందేనని, అది తప్ప వేరే మార్గం లేదని వెల్లడించిన తరువాత డాక్టర్ రాజేష్ కేశవన్ రావడంతో పాటుగా మా వారి పాదాలను తొలగించాల్సిన అవ సరం లేకుండానే నయం చేశారు. భారతీయ ప్రతిభకు నిలువెత్తు నిదర్శనం డాక్టర్ కేశవన్. మరీముఖ్యంగా డయాబెటిక్ ఫుట్ కేర్ రంగంలో ఆయన ప్రతిభ అనన్య సామాన్యం. ఈ ప్రపంచ శ్రేణి చికిత్స ప్రతి భారతీయునికీ చేరువ

కావాలని మా వారు తపించారు. అందువల్లనే, మేము డాక్టర్ కేశవన్‌కు మద్ద తు అందించడంతో పాటుగా ఆయనతో చేతులు కలిపి ఈ ప్రపంచ శ్రేణి ఇనిస్టిట్యూట్‌ను మరే భారతీయుడూ డయాబెటిక్ ఫుట్ చికిత్స కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదని చాటి చెప్పే రీతిలో ప్రారంభించాము. డాక్టర్ కేశవన్‌కు మద్దతు అందిస్తుండటం పట్ల చాలా సంతోషంగా ఉన్నాము. మా వారి ఆశయాలు, కలలను సాకారం చేసేందుకు ఆయన తీవ్రంగా శ్రమిస్తున్నారు. భారతదేశంలో డయాబెటిక్ ఫుట్ కేర్ లో గణనీయమైన మార్పులను ఏ విధంగా సాంకేతికత తీసుకువస్తుందనేది ఆయన చూపుతున్నా రన్నారు. ఈ వినూత్న కేంద్రం గురించి డాక్టర్ ఆర్‌కె డయాబెటిక్ ఫుట్ అండ్ పొడి యాట్రీ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు డాక్టర్ రాజేష్ కేశవన్ మాట్లాడుతూ " ఫుట్, పొడియాట్రిక్ కేర్ అనే పదం ప్రత్యేకమైన వైద్య చికిత్స ను సూచిస్తుంది. పొడియాట్రిస్ట్, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది సహా సుశిక్షి తులైన నిపుణులతో కూడిన బృందం మాత్రమే ఈ తరహా సేవలను అంది స్తుందన్నారు. మా వినూత్నమైన కేంద్రంలో అనా రోగ్యాన్ని ముందు గానే గుర్తించే సదు పాయాలు ఉన్నాయి. సౌకర్య వంతమైన, సమగ్రమైన దయా బెటిక్ ఫుట్ కేర్ చికిత్సను ఇక్కడ అందించగలమన్నారు.

మిర్చి రైతుల కు మద్దతు ధర

విశాలాంధ్ర - ఉలవపాడు: రైతు స్ఫూర్తి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెని నిర్వహి స్తున్న సేవ్ ఫార్మర్ సేవ్ సొసైటీ అనే కార్యక్రమ లో భాగంగా ఈ రోజు మిర పకాయలు పండించే రైతులు కి గిట్టు బాటు ధర కల్పించి దలారీకమీష న్లు ట్రాన్స్పోర్ట్ చార్జీలు తగ్గించే విధంగా చేసి రైతు కి మేలు జరిగే విధంగా చేయాలనే ఆలోచనలో రైతు స్ఫూర్తి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వై బాలచంద్ర అన్నారు. గుంటూరు నుండి మిర్చిని ఎగుమతులు చేసే ట్రేడర్స్ ని పిలిపించి వారితో మాట్లాడామని ఇక్కడ నుండి దాదాపు గా వెయ్యి టన్నుల వరకు మద్దతు ధర కు కొనుగోలు చేసేందుకు అంగీకరించి నట్లు ఆయన తెలిపారు. రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతులు ఎటువంటి రకాల వేశారు? ఎన్ని క్వింటాలు వుండ వచ్చని ఉలవపాడు భారత్ గ్యాస్ ఆఫీస్ మిద్ది పైన గల మా ఆఫీసులో నమెదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి రూ.4,95,308 ఆదాయం

విశాలాంధ్ర -వలేటివారిపాలెం: మండలం లోని మాలకొండ పుణ్యక్షేత్రంలో కొలువుతీరి ఉన్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి వారికి భక్తుల ద్వారా 4,95,308 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి కె.బి. శ్రీనివాసరావు తెలిపారు. అష్టోత్రం ద్వారా రూ.3,500, కుంకుమార్చన ద్వారా రూ.20,400, తలనీలాల ద్వారా రూ.26,975, వాహన పూజల ద్వారా రూ.1100 , ప్రత్యేక దర్శనం ద్వారా 1,06, 600 రూపాయలు ఆదాయం లభించింది. స్థల పురాణం ద్వారా 1440రూపాయలు, గదుల అద్దెల ద్వారా 15,280 రూ. కవర్ల విక్రయం ద్వారా 3,300 రూపాయలు, లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,39,995, అన్నదానం విరాళాల ద్వారా 1,81,068 రూపాయలు, ఇతర ఆదాయం 650 రూపాయలు మొత్తం ఆదాయం 4,95,308 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధి కారి కె. బి శ్రీనివాసరావు తెలిపారు.

నిరుద్యోగులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోండి: కిరణ్ రెడ్డి

విశాలాంధ్ర -మనుబోలు: మండలం లోని నిరుద్యోగులు తమ ఫౌండేషన్ తరపున నిర్వ హిస్తున్న శిక్షణా తరగ తులను సద్విని యోగం చేసుకోవాలని ఎస్.ఎస్. ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. మనుబోలు మండలంలోని రైతు కుటుంబాల నుండి డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువతీ యువకులకు ఉద్యోగాల నిమిత్తం సాఫ్ట్వేర్ టెక్నికల్ సపోర్ట్ లో భాగంగా వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు మన ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా నిర్వహించబోతున్నాం. జనవరి 12, 2023 వ తేదీన "జాతీయ యువజన దినోత్సవం" నేషనల్ యూత్ సందర్భంగా మనుబోలు మండలంలోని అక్కంపేట గ్రామంలో ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫస్ట్ స్టెప్ అనే కార్యక్రమం నిర్వహించ బడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రైతు కుటుంబాల నుండి డిగ్రీ మరియు పీజీ పూర్తి చేసిన యువతీ యువకులకు టెక్నికల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ లో ఉచిత శిక్షణా తరగతులు సాఫ్ట్వేర్, టెక్నికల్ స్కిల్స్ లో భాగంగా యువతీ యువకులకు డిజిటల్ మార్కెటింగ్, గ్రాఫిక్ డిజైనింగ్, వెబ్ డిజైనింగ్, పైథాన్, మెషిన్ లెర్నింగ్ లలో ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుంది. కమ్యూనికేషన్ స్కిల్స్ లో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్, సాఫ్ట్ స్కిల్స్ లో శిక్షణా తరగతులు నిర్వహించబడుతుంది. వీటితో పాటు ఇంటర్వ్యూ గైడెన్స్ లో కూడా మెళకువలు నేరిస్తామన్నారు. హైదరాబాద్ కు చెందిన " మార్కెటింగ్ వింగ్స్, ఐటి సంస్థ భాగస్వామ్యంతో ఆయా కోర్సుల్లోని నిపుణుల చేత ఈ తరగతులు నిర్వహించబడును. ఈ సదవకా శాన్ని మనుబోలు మండలంలోని యువతీ యువకులు ఉపయోగించు కోవాలని కోరుకుంటున్నాము. యువతీ యువకులకు మీ రెజ్యూమ్‌ను. బయోడేటాను07-01-03 నుండి ఈ నంబర్ 8712655114)కు పంపవల్సినదిగా కోరుకుంటున్నామన్నారు. అప్లికేషన్స్ 11-01-2023మధ్యాహ్నం 1 గంట వరకు స్వీకరిస్తామని, మరిన్ని వివరాలు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్.ఏఆర్‌జి లో చూడవచ్చు.

ఎంఆర్‌పి ఎస్.ఎంఎస్‌పి
జాతీయ మహాసభను జయప్రదం చేయండి: ఎంఆర్‌పిఎస్

విశాలాంధ్ర-రాపూరు: కర్ణాటకలోని బెంగుళూరులో ఈనెల 11 వతేది జరగబోయే ఎంఆర్‌పిఎస్,ఎంఎస్‌పి జాతీ య మహాసభను జయ ప్రదం చెయ్యాలని వెంకటగిరి నియో జక వర్గ ఎంఆర్‌పి ఎస్, ఎంఎస్‌పి ఇంచార్జీ గోవింద రంగయ్య మాదిగ పిలుపు నిచ్చారు. గోవింద రంగయ్య ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ ఎంఆర్‌పి ఎస్, ఎంఎస్‌పి వ్యవస్థాపక అధ్యక్షుల పిలుపు మేరకు వెంకటగిరి నియో జక వర్గం లోని 6 మండ లాలోని ఎంఆర్‌పిఎస్,ఎంఎస్ పి నాయ కులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. మహాజన సోషలిస్టు పార్టీ లక్ష్యం మాదిగ జాతిని బలమైన శక్తి గా మలచి ఎస్‌సి లోని సోదర కు లాలను ,బిసి, మైనారిటీలను, అగ్ర కులాల పేదలను కలుపుకొని సోషలిజం వైపు నడిపించి అంబేద్కర్ కలలు కన్న సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించడమే తమ లక్ష్యం అని, భవిష్యత్తులో తమ పోరా టాలు, ఉద్యమాలు అందుకు అనుగుణంగా ఉంటాయని మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సమావేశంలో రాపూరు మండల అధ్యక్షులు చింత గుంట అంకయ్య, పట్టణాధ్యక్షులు కూని పోగు అంకయ్య, బాదుష, శ్రీను, ప్రణయ్ పాల్గొన్నారు.

రెండు సర్వేల్లో వైసీపీకి తేలింది 60 సీట్లే

-పవనన్న ప్రజాబాటలో
జనసేన నేత కేతంరెడ్డి వినోద్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు సిటీ నియోజకవర్గంలో జనసేన నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్విరా మంగా, నిరాటంకంగా జరుగు తున్న పవనన్న ప్రజాబాట కార్యక్ర మం 236వ రోజున 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ ఆర్చ్ రోడ్డు ప్రాంతంలో జరిగింది. ఇక్కడ ప్రతి ఇంటికీ వెళ్ళిన కేతంరెడ్డి ప్రజల సమస్యలను అధ్యయనం చేసి అండగా నిలబడతామని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా కేతంరెడ్డి వినోద్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఇటీవల చేయించుకున్న ప్రశాంత్ కిశోర్ సర్వేతో పాటు సీఎం జగన్ ప్రత్యేకంగా చేయించుకున్న మరో ప్రైవేట్ సర్వేలోనూ వైసీపీకి వచ్చే ఎన్నికల్లో వచ్చేది 60 సీట్లే అని తేలిందని, ఇవే పరిస్థితులు కొనసాగితే ఆ సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉన్నట్లు వెల్లడైందని, దీంతో అసహనంలో ఉన్న సీఎం జగన్ ప్రస్తుత మంత్రులు, ఎమ్మెల్యేల సీట్లకు ఎసరు పెడుతున్నట్లు సమాచారం ఉందని అన్నారు. మంత్రి రోజా ఎమ్మెల్యే సీటుని సీఎం జగన్ చించేశారని దీంతో అభద్రతా భావానికి లోనవుతున్న రోజా ఇప్పుడు పవన్ కళ్యాణ్ పై తప్పుడు ప్రచారానికి పూనుకుంటున్నారని, ఇలాగైనా సీఎం జగన్ ని ప్రసన్నం చేసుకోవాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ మంత్రులు, ఎమ్మెల్యేలు తెలుసుకోవాల్సింది ఏంటం టే తమకు ఉన్న అవకాశాలను ఉపయోగించుకుని రాష్ట్రాభి వృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు
తరలి పోతున్నా పట్టించుకునేదెవరు?

విశాలాంధ్ర-రాపూరు: ప్రభు త్వ ఆదేశా లతో రాపూరు లోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ (ఎస్ఈబిస్టేషన్ ను పొదల కూరు కు మార్చారని ఎస్ఈ బిఐ తెలిపారు. ఈ సంద ర్భం గా ఆయన మాట్లా డుతూ ఏపి ఎస్ఇబి మంగళగిరి కమిషనర్ వారి ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లా ఎస్ఈబి ఎన్ ఫోర్స్ మెంట్ అధికారి కె.శ్రీ లక్ష్మి సూచనలు మేరకు పొదలకూరుకు మార్చారని తెలిపారు. ఎన్నో సం వత్సరాల నుండి ఇక్కడే వున్న కార్యాలయాన్ని మారుస్తుంటే స్థానిక నాయకులు ఏమ య్యారని, నియోజక వర్గమే తీసివేస్తేనే అడిగే దిక్కు ఎవరూ లేరని రాపూరు ను పట్టించు కునే దెవరని ప్రశ్నించారు. ఓట్లు కోసం తప్ప రాపూరు ప్రజలతో అవసరం లేదా? అని ప్రశ్నించారు. రాపూ రు ను ఆదుకునే వారు ఎవరుఅని రాపూరు ప్రజలు ప్రశ్ని స్తున్నారు.

విద్యార్థులకు ల్యాబ్ ట్యాబులు పంపిణీ

విశాలాంధ్ర -కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలో బొల్లినేని క్యాంపు కార్యాలయం లో వరికుంటపాడు మండలానికి చెందిన ఎస్ ఆర్ ఐ ధనియాలా వెంకటేశ్వరావు సహకారంతో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు సూచన మేరకు పేద విద్యార్థుల కు సహాయం చేయాలని ఆయన పిలుపుమేరకు ఫస్ట్ ఫెజ్ లో నాలుగు మండలాల కలిగిరి, కొండాపురం, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల 100మంది పేద విద్యార్థులకు ల్యాబ్ ట్యాబు లు పంపిణీ చేస్తున్నామని, రెండవ ఫెజ్ లో మిగతా నాలుగు మండలాల వింజమూరు, జలదంకి, సీతారాంపురం, ఉదయగిరి మండలాల పేద విద్యార్థులకు పంపిణీ చేస్తామని తెలిపారు.ఈ సమావేశం లో రామారావు చేతుల మీదగా ల్యాబ్ ట్యాబు లు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పేద విద్యార్థులకు తన విన్నపానికి స్పందించి సహాయం చేస్తున్న వెంకటేశ్వ రావు కు అభినందనలు తెలిపారు.ఈ వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాలుగు సంవత్సరాలలో చదువుకున్న నిరుద్యోగులకు ఎటువంటి జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు. ప్రవేట్ కంపెనీ లు తీసుకు వచ్చి ఆ కంపెనీలలో జాబ్స్ చూపించలేదు. అభివృద్ధి లేదు, సంపద సృష్టించలేదు . అప్పులు తేవడం బటన్ నొక్కడం ప్రజల మీద, నిరుపేదల మీద పన్నులు వేసి బాదడం , దోసుకోవడం, దాసుకోవడం, ఎదురు ప్రశ్నస్తే కేసులు పెట్టడం హింసించడం, ఆత్మహత్యలు, ఎస్సీ, ఎస్టీ ల దాడులు చేయడం,నిధులు మాయం చేయడం ప్రతిపక్షం ఏమి మాట్లాడ కుండా, ప్రజా వ్యతిరేకతను అణిచి వేసేందుకు బ్రిటీష్ కాలం నాటి జీఓ నెంబర్ 1 తీసుకు వచ్చి నోరు నొక్కి వేయాలని చూస్తున్న ఈ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో బంగాళాకాతంలో కలపాలని ఆయన తెలిపారు. యువత కూ డా ఆలోచించి మీ తల్లి తండ్రిలకు రాక్షస పాలనను ఇంటికి పంపుదాం అని తెలపండి. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం క్రిష్టారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంగపనాయుడు, చీమల తాతయ్య, వేణు, ధనియాల ఫౌండేషన్ సభ్యులు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమిషనర్ హరిత కు శుభాకాంక్షలు వెల్లువ

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేష న్: నెల్లూరు నగర పాల క సంస్థ కమిష నర్ హరిత కు శనివారం శు భాకాంక్షలు వెల్లు వె త్తాయి. కమి షనర్ హరిత జన్మదినం సందర్భంగా నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది ఆమె ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్ఐ లు కృష్ణ కిషోర్, సునీల్, చినబాబు, పిఆర్ వో బాలకృష్ణ, మేనేజర్ హినయతుల్లా, తదితరులు కమిషనర్ హరిత ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన విఎస్‌యు విద్యార్థుల శిక్షణ తరగతులు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా విద్యార్థులకు ఆప్టిట్యూడ్, ఇతర ఉద్యోగ నైపుణ్యాలపై ఇరవై రెండు రోజుల శిక్షణ తరగతులు గత నెల ప్రారంభమైన విషయం విదితమే.. ఈ శిక్షణ తరగతులు నేటితో ముగిశాయ ని కార్యనిర్వాహకురాలు డాక్టర్ జె విజేత శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ శిక్షణ తరగతుల ద్వారా వంద మందికి పైగా లబ్ధి పొందారు. ఈ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉపకులపతి ఆచార్య జి ఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ ఆచార్య పి రామచంద్ర రెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య జి విజయానంద్ బాబు విద్యార్థులను అభినందించారు. ఇలాంటి ఉద్యోగ నైపుణాలను పెంపొందించే శిక్షణ తరగతులను ముందు ముందు స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

అప్పన ఏడు కొండలకు ఘన సన్మానం

విశాలాంధ్ర-సీతారాంపురం: నెల్లూరు జిల్లా ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ గా ఎన్నికైన సీతారామపురం నివాసి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పన ఏడుకొండలకు సీతారాంపురం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో సీతారామపురం ఎస్టీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా అప్పన ఏడుకొండలు మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల పక్షాన రాబోవు రోజుల్లో నిర్వహించబోయే ఆందోళన కార్యక్రమాల్లో ఎస్టీయూ సంఘ పక్షాన, ఉదయగిరి నియోజక వర్గ ఉపాధ్యాయుల పక్షాన క్రియాశీలక పాత్ర పోషిస్తానన్నారు. అంతకు ముందు సీతారామపురం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఎస్టీయూ క్యాలెండర్ ను నెల్లూరు జిల్లా ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్, జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పన ఏడుకొండల ఆధ్వర్యంలో సీతారాంపురం ఎస్టీయూ నాయకుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో ఎస్టీయూ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగయ్య, సుభాని , ఆర్థిక కార్యదర్శి ఖాసిం పీరా, జిల్లా కార్యదర్శులు రాజేష్, విజయ్ ఎస్టీయూ నాయకులు పాండు, విజయ్ కుమార్, వెంకట నారాయణ, అన్సర్ బాష పాల్గొన్నారు.

తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కీలక మలుపు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: రాష్ట్రంలో సుమారు 10 వేల మంది కి పైగా ఉపాధ్యాయులను కలిగిన లాంగ్వేజ్ పండిట్స్ కు సంబంధించి అతిపెద్ద సంఘం స్టేట్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఎస్ఎల్‌టిఏ రాష్ట్ర శాఖ వారు నెల్లూరులో ప్రత్యేకంగా సమా వేశమై తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కి మద్దతు ప్రక టించా రు. ఈ కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివానంద రెడ్డితో పాటు, నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమావేశమై చంద్రశేఖర్ రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 10 వేల 214 మంది లాంగ్వేజ్ పండిట్లకు గత సంవత్సరం స్కూల్ అసిస్టెంట్స్ గా పదోన్నతులు కల్పించడంలో ఎస్ఎల్‌టిఏ చేసిన కృషి అందరికి తెలిసిందేనని రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య అన్నారు. మూడు జిల్లాల్లో అసోసియేషన్ సభ్యుల అభిప్రాయ సేకరణ నిమిత్తం చంద్రశేఖర్ రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని చెప్పారు. తెలుగు, హిందీ ఉపాధ్యాయులు అందరూ కలిసి కట్టుగా ఉండి చంద్ర శేఖరెడ్డిని గెలిపించుకుందామని పిలుపు నిచ్చారు. అనంతరం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ లాంగ్వేజ్ పండిట్లు (ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్స్) కు సంబంధించి అతిపెద్ద సంస్థ ఎస్ఎల్‌టిఏ మద్దతు ప్రకటించడం సంతోషం గా ఉందన్నారు. అసోసియేషన్ వారు ప్రధానంగా నాలుగు సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని రాబోయే రోజుల్లో వాటన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు.

భక్తుల మనోభావాలకు భంగం కలిగించొద్దు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మి నరసింహ స్వామి దర్శనానికి వచ్చే భక్తుల మనోభావాలకు భంగం కలిగించవద్దని స్థానిక శాసన సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి సిబ్బందికి సూచించారు. శనివారం మండలం లోని మాలకొండ లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలిం చారు. కొండపై ఉన్న షాప్‌ల దగ్గరకు వెళ్లి వస్తువుల అమ్మకాలను పరిశీలించారు. అధిక రేట్లకు అమ్మకుండా నిర్ణిత ధరలకే అమ్మాలని షాప్ యజమానులకు సూచించారు. అనంతరం కేశఖండన శాలకు వెళ్లి పరిశీలించారు. అనంతరం లడ్డు కౌంటర్ దగ్గరకు వెళ్లి లడ్డు నాణ్యతను పరిశీలించి తూకం వేసి ఆలయ అధికారికి పలుసూచనలు చేశారు. అనంతరం దేవస్థానం నిధులతో భక్తుల సౌకర్యార్థం రూ.92 లక్షలతో నూతనంగా నిర్మించిన ఎస్ ఎస్ క్యూలైన్లు, అన్నదానం వద్ద క్యూలైను, ప్రత్యేక దర్శనంకు పోవు మార్గం క్యూలైను, ఉచిత దర్శనంకు పోవు క్యూలైను లను పరిశీలించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని పరిశీలించారు. అన్న ప్రసాదంలో పాల్గొన్న సేవకుల పని తీరును మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానంకు వచ్చే భక్తుల మనోభావాలకు భంగం కలగకుండా భక్తులను స్వామి అని పిలవాలని అన్నారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి తో పాటు రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి కెవి శ్రీనివాసరావు, గుడ్లూరు సీఐ సుబ్బారావు, వలేటివారి పాలెం ఎస్సై బి.సుదర్శన్ యాదవ్, గుడ్లూరు ఎస్సై ప్రసాద్ రెడ్డి, ఆలయ సిబ్బంది శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, నారాయణ, పోలీస్ సిబ్బంది, నాయకులు తోకల కొండయ్య, అనుమోలు వెంకటేశ్వర్లు, పరిటాల వీరాస్వామి, సంజీవరెడ్డి, అయ్యవారిపల్లి సర్పంచ్ దేగా వెంకటేశ్వర్లు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటివద్దకే వైద్యంను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర -వలేటివారిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో ప్రతి ఇంటికి వైద్య సేవలు అనే లక్ష్యంతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని నూతనంగా ప్రవేశ పెట్టారని ఈ విధానంలో 104 సేవలు సచివాలయ పరిధిలోని అన్ని గ్రామాలకు అందు తాయని, ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వలేటివారిపాలెం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం డాక్టర్ ఈద మణి దీపిక అన్నారు. శనివారం మండలంలోని చుండి సచి వాలయం లో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మణిదీపిక మాట్లాడుతూ 104 సేవలలో దీర్ఘకాలిక జబ్బులకు చికిత్స అందించడమే కాకుండా నెలకు సరిపడా మందులు అంది స్తామన్నారు. 104సేవలో ఒక డాక్టర్, ఎంఎల్.హెచ్.పీ. లు,ఏఎన్ ఎం లు, హెల్త్ అసిస్టెంట్‌లు సేవలు అందజేస్తారని తెలిపారు. కామెర్లు,రక్తపోటు, మధుమేహం, నేత్ర, ముక్కు చెవి, గొంతు, తదితర వ్యాధులకు వైద్యం అందజేస్తారని అన్నారు. డాక్టర్ మణిదీపిక ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మణిదీపిక ,ఏఎన్ ఎం ప్రమీలా రాణి, యంపిపిహెచ్‌ఎస్, ఆశా కార్యకర్త వరమ్మ, సిబ్బంది , వివిధ రకాల వ్యాధులతో బాధపడు పడుతున్న ప్రజలు పాల్గొన్నారు.

అమ్మ ఒడిలో మాయాజాలం

- ఆధార్ ఒకరిది ,అకౌంట్ మరొకరిది - లబ్ధిదారునికి చేరని నగదు
- ఎవరి ఖాతాకు నగదు చేరిందో తెలియదంటున్న అధికారులు
- ఆన్‌లైను పొరపాటు జరిగితే అంతేనా.. బాధ్యత ఎవరిది?

విశాలాంధ్ర -అనుమసముద్రంపేట: అమ్మ ఒడి పథకంలో కొందరు చిన్నారులకు నగదు చేరక కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం నగదు విడుదల చేసినా ఆ నగదు ఏ అకౌంట్లో జమయిందో, ఎవరా నగదును తీసుకున్నారు? అనే విషయాలను చెప్పలేని స్థితిలో అధికారులు ఉన్నారు. ఇలాంటి పరిస్థితులు ఎందుకు ఉత్పన్నమవుతున్నాయో ఉన్నతాధికారులకే తెలియాల్సి ఉంది. గతంలో అమ్మఒడి పథకానికి విద్యార్థులను ఎంపిక చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉండేది .అందువల్ల సక్రమంగా పేర్లు, నెంబర్లు నమోదు అయ్యేవి. ప్రస్తుతం సచి వాలయాలు, ఎంఈఓ కార్యాలయాల వద్ద అమ్మ ఓ డి లబ్ధిదారులు నమోదు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. అయితే ఆ డేటా పూర్తిస్థాయిలో సంబంధిత అధికారులకు అవగాహన ఉండడం లేదు. ఎవరికిచ్చారు ఏ అకౌంట్లో నగదు జమవుతున్నాయి అన్న వివరాలను పూర్తిస్థాయిలో తెలుసుకోలేని స్థితిలో బ్యాంకర్లు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. ఒక పేరుతో ఉన్న ఆధార్ నమోదు చేసి వారికి సంబంధించిన ఫోన్ నెంబర్ అకౌంట్ నెంబర్ లింక్ చేస్తే వేరే అకౌంట్ లో వేరే ఫోన్ నెంబర్ కు ఏ విధంగా ఆ నగదు లింక్ అయ్యాయో తెలుసుకునే స్థితిలో అధికారులు లేరు. దాంతో లబ్ధిదారులు వారి సమస్య పరిష్కారం కోసం ఏ అధికారి వద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో కాళ్లు అరిగేలా కనిపించిన వారందరికీ విషయం చెబుతూ ఇబ్బందులకు గురవుతున్నారు. అందువల్ల ప్రభుత్వంపై వ్యతిరేకత కొంతమేర పెరుగుతుంది. అధికారులు చేస్తున్న తప్పులకు ప్రభుత్వ నిందల పాలవుతుందన్నది. వివరాల్లోకి వెళితే ఏ ఎస్ పేట మండలం గుంపర్లపాడు కు చెందిన కాజా మోహిద్దీన్ జరీనా బేగం ల కుమారుడు ఖజా మస్తాన్ గత ఏడాది పదవ తరగతి చదివి ప్రస్తుతం ఇంటర్మీడియట్ కలిగిరిలో చదువుతున్నాడు. 8, 9 తరగతి లో అమ్మఒడి నగదు విద్యార్థి, విద్యార్థి తల్లి జాయింట్ అకౌంట్లో తీసుకున్నారు. పదవ తరగతికి సంబంధించిన అమ్మవొడి గత ఏడాది మే జూన్ నెలలో ప్రభుత్వం అందజేసింది. ఆ సమయంలో కొందరికి నగదు జమ కాకపోవుటతో రెండో విడతగా డిసెంబర్ 27వ తేదీన ముఖ్యమంత్రి అమ్మఒడి సొమ్ము విడుదల చేశారు. రెండో విడత విడుదలైన నగదు సైతం కాజా మస్తాన్ తల్లి జరీనా బేగం జాయింట్ అకౌంట్ కు జమ కాలేదు. దాంతో భర్త కాజముద్దీన్ వారి ఆధార్ బ్యాంక్ అకౌంట్ ఫోన్ నెంబర్లను తీసుకొని స్థానిక సచివాలయానికి వెళ్లి డబ్బులు ఎందుకు జమకాలేదో పరిశీలించాలని కోరారు. పరిశీలించిన సచివాలయ సిబ్బంది ఫోన్ నెంబర్ ,బ్యాంకు ఖాతా నెంబర్ మారిపోయాయని అందువల్ల నగదు జమ కాలేదని, వేరే వారి అకౌంట్లో జమ అయ్యాయని తెలిపారు. స క్రమంగా అన్ని ఆధారాలు ఇచ్చినా ఎందుకు జమ కాలేదని ఖాజా మొద్దీన్ ప్రశ్నించిన సమాధానం దొరకలేదు. ప్రభుత్వం తమకు ఇచ్చిన నగదు ఏ అకౌంట్ కు జమ అయిందో చెప్పాలని కోరినా బ్యాంక్ అధికారులు, కానీ సచివాలయ ఉద్యోగులు గాని తమకు తెలియదని సమాధానం చెబుతుండడంతో లబ్ధిదారులు అయోమయస్థితిలో పడ్డారు. ఇంత పటిష్టమైన వ్యవస్థ ఉన్నా నగదు ఏ అకౌంట్ కు జమయిందో చెప్పలేకపోవడం ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. అమరావతిలోని కాల్ సెంటర్కు ఫోన్ చేసి అడిగితే సచివాలయ ఉద్యోగులను అడిగి తెలుసుకోమని వారు చెబుతున్నారని తమ సమస్య పరిష్కరించే నాధుడు లేడని వాపోతున్నారు. ఎడవల్లి కెనరా బ్యాంకులో తన భార్య కుమారుడి జాయింట్ అకౌంట్ పై గతంలో నగదు జ మ అయ్యా యని ఫోన్ నెంబర్ ఆ అకౌంట్ కు లింక్ చేసి ఉన్నామని తెలిపారు. తమకున్న ఏ అకౌంట్ కు కూడా నగదు జమ కాలేదని ప్రస్తుతం తమ పేరుతో విడుదలైన నగదు ఏ అకౌంట్ కు జమ అయిందో జిల్లా ఉన్నతాధికారులు తెలుసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. సోమవారం నెల్లూరులో స్పందనకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పోలీస్ వెల్ఫేర్ డే: ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: జిల్లాలోని పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా భావించి 'పోలీస్ వెల్ఫేర్ డే' ఎస్పీ విజయ రావు నిర్వహిం చారు. విధి నిర్వహణలో నిమగ్నమై ఉండే పోలీ సు సిబ్బంది సంక్షేమానికి నిత్యం కృషి చేస్తామని విధి నిర్వహణలో బాధ్యతగా విధులు నిర్వహిం చాలని, అనధికారికంగా గైర్హాజరు అవుతూ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మీ నిర్లక్ష్యం కారణంగా మీతో పాటు మీ కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతారన్నారు. తద్వారా ప్రమోషన్స్, ఇంక్రిమెంట్స్ నష్టపోతారని, పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని పోలీస్ సిబ్బంది ప్రతి ఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అర్జీలను స్వయంగా స్వీకరించి, సమగ్రంగా విని, వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని యస్.పి భరోసా కల్పించారు. సస్పెన్షన్ నుండి విధులకు తీసుకోవడం, ప్రమోషన్, బదిలీలు, సర్వీసు సంబంధిత సమస్యలు, గ్రేడ్ ఇంక్రిమెంట్, డిప్యుటేషన్, భద్రత, హౌసింగ్ లోను సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు సంబంధిత అర్జీలు స్వీకరించారు. వృత్తి పరమైన, ఆరోగ్య పరమైన సమస్యల అర్జీలపై సత్వరమే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

స్పాస్టిక్స్ సెంటర్ దివ్యాంగులకు యూనిఫాం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎంఎస్ఆర్ స్పాస్టిక్ సెంటర్ కు సంబంధించి దివ్యాంగులకు యూనిఫాం సుమారు 110 మంది బాల బాలికలకు రెండు జతలు చొప్పున పిఎస్ఆర్ అధినేత సీతారామాంజనేయులు గుడ్డ కొనుగోలుకు రూ.70,000 పినాకిని లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ప్రెసిడెంట్ నల్లారి కుమార్ ద్వారా వారి సభ్యులచే కుట్టు కూలికి గాను రూ.30,000 వెచ్చించి శనివారం పిల్లలందరికీ అందించారు. ఈ కార్యక్రమంకు సదరు చైర్మన్ పి. చంద్రశేఖర్ రెడ్డి, కన్వీనర్ నేతాజీ సుబ్బారెడ్డి ఎంసి మెంబర్ దాసరి రాజేంద్ర ప్రసాద్ , ప్రిన్సిపల్ గురునాధరావు కన్వీనర్ వెంకు రెడ్డి , సెక్రెటరీ మస్తానయ్య, ఏవో చంద్రశేఖర్, పిఎస్ఆర్ అధినేత సీతారామారావు పిల్లలకు యూనిఫామ్ అందజేశారు. చైర్మన్ పిల్లల యూనిఫామ్‌కు సహకరించిన రామాంజనేయులు వారి మిత్ర బృందంకు ధన్య వాదాలు తెలిపారు. పిల్లలలో అందరూ ఒకటే అన్న భావన కల్పించి దివ్యాంగులకు అందజేసినందుకు తన కృతజ్ఞతలు ,కన్వీనర్ సుబ్బారెడ్డి తెలి పారు. పిఎస్ఆర్ అధినేత సీతా రామాంజనేయులు తన వంతు స్పాస్టిక్ దివ్యాంగులకు ఒక లక్ష రూపాయలు ఇవ్వదలచినట్లు సభా ముఖంగా తెలిపారు. ఈ కార్యక్రమంకు వైస్ ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, డాక్టరు వాసు, స్టాఫ్ పిల్లల తల్లిదండ్రులు , పిల్లలు హాజరయ్యారు.

నేడు బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సమాఖ్య సహాయ సహకారాలతో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి స్థానిక శ్రీ సత్యసాయి కళ్యాణమండపం సూళ్లూరుపేట పట్టణంలో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తారని ఈ వివాహ వేదికలో రాష్ట్ర అన్ని జిల్లాల నుంచి వధూవరులు వారి తల్లి తండ్రులు పాల్గొంటారన్నారు. బ్రాహ్మణ బంధువులందరూ వారి కుటుంబాలలో సిద్ధంగా ఉన్న వధూవరులు ఈ వివాహ వేదిక ద్వారా పేర్లు ఈ కింది వారి వద్ద నమోదు చేసుకొని వారి బంగారు భవిష్యత్తుకు మార్గం సుగమం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఇసుకపల్లి కామేశ్వర ప్రసాద్ 9848486599 ఒక ప్రకటన ద్వారా తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి కార్యవర్గ సభ్యులు మహిళా విభాగ కార్యవర్గ సభ్యులు, అర్చక పురోహిత విభాగ కార్యవర్గ సభ్యులు, యువజన విభాగ కార్యవర్గ సభ్యుల బ్రాహ్మణ బంధువులందరు పాల్గొని ఈ కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరారు.

జగనన్న ప్రభుత్వంలో అర్హులకు అసైన్డ్ పట్టాలు

విశాలాంధ్ర -అనుమసముద్రంపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల అనుసారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జెసి, శాసన సభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశాల మేరకు అసైన్ భూములను గుర్తించి సదరు భూముల్లో అనుభవంలో వున్న వారికి ప్రభుత్వం ద్వారా గుర్తించి అసైన్ పట్టాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. అందులో భాగంగా నేడు ఏఎస్ పేట మండలంలోని అనుమసముద్రం గ్రామ సచివాలయం ఆవరణంలో అసైన్ పట్టాలను పంపిణీ చేసేందుకు శ్రీకారం చుడుతూ మండల తహశీల్దార్ వారి సిబ్బంది, అనుమ సముద్రం గ్రామ రెవెన్యూ అధికారితో కలిసి నేడు ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి నివేదిక తయారు చేసి అసైన్డ్ కమిటీకి, శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి అర్హులైన అందరికీ అసైన్ పట్టాలు వచ్చేలా కృషి చేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ పేట డిప్యూటీ తహశీల్దారు, అనుమసముద్రం గ్రామ రెవెన్యూ అధికారి, అనుమ సముద్రం గ్రామ సర్వేయర్, అనుముసముద్రం గ్రామ సర్పంచ్ కుదారి హజరత్తమ్మ, జిల్లా వక్ఫ్ బోర్డ్ వైస్ చైర్మన్ షేక్ షౌకత్ అలీ పాల్గొన్నారు.

ఆక్వా జోన్ రైతులకు సబ్సిడీ విద్యుత్తు

విశాలాంధ్ర- బుచ్చిరెడ్డిపాలెం : ఆక్వా జోన్ పరిధిలోని మత్స్యకార రైతులకు సబ్సిడీపై విద్యుత్తు అందిస్తున్నట్లు మత్స్య శాఖ అధికారి పొట్టయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని మినగల్లు గ్రామంలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకార రైతులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా మత్స్యకారులకు అనేక రకాల పథకా లు అందిస్తోంది అన్నారు. ఆక్వా జోన్ ఏర్పాటుచేసి విద్యుత్ ను సైతం సబ్సిడీపై అందిస్తోంది అన్నారు. ఈ అవకాశాన్ని ఆక్వా రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆయన వెంట విలేజ్ ఫిష్ అసిస్టెంట్ రంజిత్ సచివాలయ సిబ్బంది రైతులు ఉన్నారు.

మేఘనకు మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సాయం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: బుజబుజనెల్లూరు నక్కల కాలనీ లో యాసిడ్ దాడికి గురైన బాలిక మేఘన కుటుంబానికి సీఎం సహా య నిధి నుండి ఆర్థిక సహాయం మరో 10 లక్షల రూపాయలు మంజూరు చేయించి, బాలిక కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి యాసిడ్ అందించారు. దాడికి గురైన మేఘనకు ఇప్పటికే, ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 20 లక్షల రూపాయలు మంజూరు చేయించి, మరో 10 లక్షల రూపాయల మంజూరు పత్రాన్ని బాలిక తండ్రికి మంత్రి అందించారు. మేఘనకు మెరుగైన వైద్యం కోసం చెన్నై అపోలో హాస్పిటల్ కి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 30 లక్షల రూపాయలు మంజూరు చేయించడంతో పాటు, కుటుంబ అవసరాల కోసం మరో 5 లక్షలు అందించామని మంత్రి వెల్లడించారు. బాలిక మేఘన వైద్య అవసరాల కోసం 35 లక్షల రూపాయలు అందజేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తమ బిడ్డకు చేసిన సహాయానికి, తమ కుటుం బానికి అండగా నిలిచినందుకు జీవిత కాలం రుణపడి ఉంటామని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాసంక్షేమమే సీఎం లక్ష్యం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- వలేటి వారిపాలెం: ప్రజాసంక్షేమమే సీఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి అన్నారు. శనివారం లింగ సముద్రం మండలంలోని మాలకొండ రాయుని పాలెం సచి వాలయం పరిధిలోని మాలకొండరాయుని పాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి హాజరై ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు సమస్యలు అడిగి తెలుసుకొని వాటిని పరిష్క రించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల ప్రతి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించడంతో పాటు గ్రామ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకొంటు న్నామన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి పథకం నేరుగా లబ్ధిదారులకు అందేలా సీఎం జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవితాలను మెరుగుపరిచేలా చర్యలు తీసు కొంటున్నామన్నారు. అనంతరం లింగసముద్రం మండలంలోని మండల ప్రజాపరిషత్ కార్యా లయ ప్రాంగణంలో నూతన పింఛన్లు పంపిణీ కార్యక్రమం పండుగలా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసన సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేరువ చేయడంలో లబ్ధిదా రులకు, ప్రభుత్వానికి అను సంధాన వ్యవస్థగా గ్రామ, వార్డు సచి వాలయం, వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటుచేసి, పాలనలో పారదర్శకత, జవాబు దారీతనం పెంపొం దింపజేశారని గుర్తుచేశారు. కేవలం ఎన్నికల కోసమే వాగ్దానాలు, హామీలు గుప్పిస్తూ ప్రజలను మభ్యపెట్టే గత రాజకీయాలకు పాతరవేసి, సరికొత్త ఒరవడికి జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టా రన్నారు. ప్రజలు దీన్ని గమనించాలన్నారు.ఇచ్చిన మాట కోసం ఎంతైనా కష్టపడే ముఖ్యమంత్రి మన రాష్ట్రానికి ఉండడం ప్రజల అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలోతహసీల్దార్ సుధాకర్, ఎంపిడిఓ చంద్రసేన్ ,ఎస్ఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎంపీపీ పెన్నా క్రిష్టయ్య, వైస్సార్‌సీపీ నాయ కులు పరికూటి కృష్ణా రెడ్డి, పిచ్చాపాటి తిరుపతి రెడ్డి, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, అధికారులు,సచివాలయం సిబ్బంది, లబ్ధిదారు లు పాల్గొన్నారు.

తోటపల్లి గూడూరు మండల సిపిఐ కన్వీనర్ గా తలారి ఏడుకొండలు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: సర్వేపల్లి నియోజకవర్గం లోనితోటపల్లి గూడూర్ మండల సిపిఐకన్వీనర్ గా తలారి ఏడు కొండల ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివా రం నలుకూరు లో తిన్నేపూడి రాఘవయ్య అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సమావే శంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దామ అంకయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ముక్త గడ్డంతో తిప్పి కొట్టాల్సిన అవసరం ఆసన్నమైందని అందుకోసం గ్రామ గ్రామా లలో పార్టీని పార్టీకి అనుబంధంగా ఉన్నటువంటి రైతు సంఘాలను యువజన సంఘాలను వ్యవసాయ కార్మిక సంఘాలను మహిళా సంఘాలను బలోపేతం చేస్తూ పార్టీ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి అని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ 98 ఏళ్ల చరిత్ర కలిగినటువంటి పార్టీ అని మొదటి నుంచి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాడుతున్న పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని ఆయన అన్నారు. నేడు రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి చీకటి జీవోలను తెచ్చి ప్రజాస్వామ్యబద్ధంగా చేస్తున్నటువంటి సభలు సమావేశాలు కూడా జరుపుకునేందుకు అవకాశం లేకుండా విడుదల చేసిన జీవో నెంబర్ ఒకటిని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు అలాగే కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కార్మిక వ్యతిరేకంగా తీసుకొస్తున్న నల్ల చట్టాలను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నందిపోగల రమణయ్య నందయ్య జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్ ముత్తుకూరు మండల సిపిఐ కార్యదర్శి ఏడుకొండలు తదితరులతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రవరణ కాలంలో పార్టీని బలంత బలోపేతం చేసి మండలంలోని అన్ని గ్రామాలలో విస్తృతస్థాయిలో సభ్యత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని అదేవిధంగా భూ పోరాటాలతో పార్టీని మరింత ముందుకు తీసుకుని వెళ్లేందుకు జిల్లా నాయకులు కలసి పనిచేస్తానని నూతనంగా కన్వీనర్ గా ఎన్నికైనటువంటి ఏడుకొండలు తెలిపారు.

సీఐ సుధాకర్ ఇంటికి వెళ్లి పరామర్శించిన ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: అనారోగ్యంతో ఉన్న సీఐ సుధాకర్ ఇంటికి ఎస్పీ విజయ రావు వెళ్లి పరామర్శించారు. కావలి 2 టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యం కారణంగా ఇంట్లో ఉన్న సీఐ ఎ సుధాకర్ ఆపరేషన్ కు నగదు కావాలని కుటుంబ సభ్యులు ఇబ్బందులను గ్రహించి, స్వయం గా ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆపరేషన్ నిమిత్తం ఎస్పి ఆర్థిక సాయం అందించారు. ఇతర పోలీసు అధికారులు, జిల్లా పోలీసు యంత్రాంగం మీ వెంటే ఉందని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. దిగ్వి జయంగా ఆపరేషన్ పూర్తి చేసుకొని వచ్చి కలిసి విధులు నిర్వహించాలని సుధాకర్‌కి ఎస్పి మనోధైర్యం చెప్పారు. అన్ని విధాల తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన క్యాలెండర్ డిప్యూటీ లేబర్ కమిషన్ ఆఫ్ నెల్లూరు వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు అందరూ కూడా గుర్తింపు కార్డులను అప్లై చేసుకోవాలని గుర్తింపు కార్డులు రెన్యువల్ చేసుకోవాల్సిన వాళ్లు వెంటనే రెన్యువల్ చేసుకోవాలని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల నుంచి రావలసిన అన్ని పథకాలు కూడా వీరికి వర్తిస్తాయని ఆయన తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలేవైనా ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ నగర కార్యదర్శి శ్రీనివాసులు, పెంచలయ్య పాల్గొన్నారు.

మేకపాటి విక్రమ్ రెడ్డితో గిరిధర్ రెడ్డి మర్యాద పూర్వక భేటీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: వైసీపీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి నెల్లూరు డైకాస్ రోడ్ లోని నివాసంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ గిరిధర్ రెడ్డిని అభినందించారు.

సినీ నటుడు అలీ రాక

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ప్రముఖ సినీ హాస్య నటుడు, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారులు అలీ ఈనెల 8వ తేదీ నెల్లూరు వస్తున్నారని డాక్టర్ మహ్మద్ రఫీ తెలిపారు. నెల్లూరు ప్రెస్ క్లబ్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయంగా కళా రంగానికి సేవలు అందిస్తున్న కళ 10వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు అలీ వస్తున్నారన్నారు. డాక్టర్ మహ్మద్ రఫీ, డాక్టర్ కొండూరు హరి నారాయణ రెడ్డి, పి. అమానుల్లా ఖాన్, దగ్గుపాటి రాధాకృష్ణ పాల్గొ న్నారు. ఆంధ్రప్రదేశ్ భాషా సృజనాత్మక సమితి, కలయిక ఫౌండేషన్, కళ సంయుక్త ఆధ్వర్యంలో 8వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు నెల్లూరు టౌన్ హాల్ లో జరిగే ఈ వేడుకలో సమాజ సేవకులు, 5 వేల వివాహాలు చేయించిన డాక్టర్ కొండూరు హరి నారాయణ రెడ్డి ని సింహపురి సేవా సార్వభౌమ బిరుదుతో సత్కరిస్తున్నారు.డాక్టర్ కొండూ రు హరినారాయణ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ లోగో ఆవిష్కరణ లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, పూర్వ పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొంటారు. తెలంగాణకు చెందిన 30 మంది సురభి కళాకారులు ఘంటసాల నాటకం ప్రదర్శించనున్నట్లు డాక్టర్ మహ్మద్ రఫీ వివరించారు. హైదరాబాద్ నుంచి ప్రముఖ నర్తకి రోహిణి కందాల, మిమిక్రీ స్టార్ రమేష్ ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. పెద్ద ఎత్తున కళాభిమానులు విచ్చేసి జయప్రదం చేయాలని ఆహ్వానిస్తున్నారు.

పాఠశాలల సమగ్ర అభివృద్ధికే ప్రణాళికలు

విశాలాంధ్ర- బుచ్చిరెడ్డిపాలెం: పాఠశా లల సమగ్ర అభివృద్ధి కోసమే ప్రధా నోపాధ్యా యులు పేరెంట్స్ కమిటీతో చర్చించి ప్రణాళికలు తయారు చేయాలని మండల విద్యాశాఖ అధికారి ఎం.దిలీప్ కుమార్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలల ప్రణాళికల తయారీ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన కోసం ప్రధానోపా ధ్యాయులు పేరెంట్స్ కమిటీ సభ్యులతో శిక్షణా కార్యక్రమం మండల విద్యాశాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలలో అమల వుతున్న రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు, పిల్లల నూతన ఆవిష్కరణలు,మౌలిక సదుపాయాలు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సమాచారం సమగ్రంగా పొందుపరచాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, జల సంరక్షణ, స్వచ్ఛత పాఠశాల తదితర వివరాలు ప్రణాళికలో ఉండాలన్నారు. 8,9 తేదీలలో గ్రామసభలు నిర్వహించి అందరి తో చర్చించి సకాలంలో అందజే యాలన్నారు . ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్ గా పెనుబల్లి ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు పి.వి.రత్నం, జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్ కుమార్,సి ఆర్ పి ఎస్ మల్లేశ్వర్ రెడ్డి వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, పేరెంట్స్ కమిటీ చైర్మన్స్,సభ్యులు పాల్గొన్నారు.

కసునూరు సర్పంచు వైసీపీలో చేరిక

విశాలాంధ్ర బ్యూరో - నెల్లూరు: సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటా చలం మండలం, కసుమూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి గా పోటీ చేసిన మందా రమణయ్య అలియాస్ మెకానిక్ రమణయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసె సింగ్ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలం మండల మాజీ జెడ్పిటిసి, మండల వెంకటశేషయ్య యాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కార్మికులను వేధింపులకు గురిచేయడం సరికాదు: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-ఆత్మకూరు : కావలి మున్సిపాలిటి నందు కావలి మున్సిపల్ కమిషనర్, ఆఫీసు గుమస్తా అయినటువంటి శానటరి ఇన్స్ పెక్ట్ అని చెప్పుకునే బొద్దు మహేష్ అనే వాళ్లు ప్రభుత్వానికి, కార్మికులకు వ్యతిరేకంగా విధులు నిర్వహిస్తున్నారని కార్మికులకు సానిటరీ సెక్రటరి ద్వారా మస్టర్లు వేయకుండా బొద్దు మహేష్ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కార్మకులను వేధింపులకు గురిచేస్తున్నారని, ఇలా చేయడం సరైన పద్ధతి కాదని ఏఐటీయుసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగం నాగరాజు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కార్మికులపై ఇలాంటి వ్యక్తులు చేస్తున్న పనుల వల్ల అటు ప్రభుత్వానికి కూడా చెడ్డ పేరు వస్తుందని పేర్కొన్నారు. ఈ విషయమై ఈ నెల 4వ తేది కావలిలో విలేకర్ల సమావేశాన్ని నిర్వసించడం జరిగిందని వివరించారు. 6వ తేది మున్సిపల్ కమీషనర్, కావలి పిలిపించి బొద్దు మహేష్ ఆఫీసు గుమాస్తా కాబట్టి ఆఫీసు విధులకే వినియోగించుకుంటామని చెప్పారని అన్నారు. కానీ 7వ తేది శానటరీ సెక్రటరి వారు మస్టర్లు వేయమని అడిగితే దుర్భాషలాడారని, బొద్దు మహేష్ కు భయపడే వారు ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని, సదరు వ్యక్తిపై అనేక కేసులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. కానీ కావలి కమీషనర్ ఆయన మాటే వింటూ కార్మికులను పట్టించుకోవడం లేదని, ఇలాంటి నేరస్తులు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే కార్మికులు, కావలి ప్రజలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. తక్షణమే వారిని సస్పెండ్ చేయాలని ఏఐటీయుసీ జిల్లా కార్మిక సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవం

- ముగిసిన ఉత్సవాలు - భక్తి శ్రద్ధలతో పూజలు

విశాలాంధ్ర-అనుమసముద్రంపేట: బాణాసంచా పేలుళ్ల ,మేళ తాళాలు, భజనలు మధ్య శ్రీ చెన్నకేశవ స్వామి వారి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఏఎస్ పేట మండలం చిన్న అబ్బీపురం దళితవాడలో కొలువైన చెన్నకేశవ స్వామి ఉత్సవాలు గత రెండు రోజులుగా ఘనంగా నిర్వహించారు .ఉభయ దాతలు బట్టు వినోద్ ఆయన సతీమణి విష్ణు వందన ఆధ్వర్యంలో కార్యనిర్వాహకులు జొన్నలగడ్డ చెన్నకేశవులు , లలిత కుమారి ఉత్సవాలను నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చెన్నకేశవులు మాట్లాడుతూ 2019-20 లో వచ్చిన కరో నా మహమ్మారి వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్వామిని మొక్కుకున్నామని తెలిపారు. స్వామి చలవతో కరోనా ముప్పు తొలగిందన్నారు. అందువల్ల స్వామివారికి ప్రత్యేకంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించామని వారు తెలిపారు. గ్రామంలో చెన్నకేశవ స్వామి బంతి ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రజలందరికీ స్వామి కృపాకటాక్షాలు ఉండాలని కోరారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజలు చేశారు.